నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 16 ఆగస్టు 2023

నేడు బాల్కొండలో మంత్రి వేముల పర్యటన

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో నేడు(బుధవారం) మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యటించనున్నారు. సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు, డివైడర్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదేవిధంగా తెలంగాణ ఫంక్షన్ హాల్ నుండి డబుల్ బెడ్ రూమ్ వరకు వయా సంతమల్లన్న గుడి నూతన ఆర్.అండ్.బి బిటి రోడ్డుతో పాటు, మండల కేంద్రంలో రింగు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. కిసాన్‌నగర్ పంచాయతీ భవనం పనులు ప్రారంభించి రోడ్డువిస్తరణ పనుల ప్రారంభోత్సవం చేయనున్నారు. కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్టు నాయకులు తెలిపారు.

ఇన్‌ఫ్లో 3150.. ఔట్‌ఫ్లో 7175

నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

నవతెలంగాణ-నిజామాబాద్

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీ నీటిమట్టం నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 3150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతండగా, కాలువల ద్వారా 7151 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.3 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1090 అడుగుల (84.810 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురవక పోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. గతేడాది ఇదే సమయానికి 1089 అడుగుల (80.140 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

పరిపాలనా దక్షతతో సుపరిపాలన



జెండా ఆవిష్కరించి జాతీయగీతం ఆలపిస్తున్న స్పీకర్, ప్రజాప్రతినిధులు, అధికారులు

- అన్ని వర్గాల వారికి రాష్ట్ర ప్రభుత్వ హయాంలో చేయూత
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

'భారతదేశం పేదది కాదు, ప్రజలు మాత్రమే పేదవారు. పరిపాలన దక్షతతో సుపరిపాలన గావిస్తే దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందుతుంది. మనది వ్యవసాయ ఆధారిత దేశం. జనాభాలో 70 శాతం వ్యవసాయం, అనుబంధం రంగాలపై ఆధారపడి ఉన్నారు. దేశ జనాభాకు అవసరమైన ఆహారాన్ని అందిస్తుంది రైతులు. అలాంటి రైతులను కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నది. రైతును రాజు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు, రైతు బీమాతో పాటు 24 గంటల ఉచిత్ విద్యుత్, సాగు జలాలు అందించి మద్దతు ధరకు పంటను కొనుగోలు చేసి ఆదుకుంటుందని' స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో మంగళవారం రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని వెన్నెముక రైతు అని, రైతును రాజు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు, రైతు బీమాతో పాటు 24 గంటల ఉచిత్ విద్యుత్, సాగు జలాలు అందించి మద్దతు ధరకు పంటను కొనుగోలు చేసి ఆదుకుంటుందని తెలిపారు. తద్వారా నాడు కోటి ఎకరాలు సాగవుతుండు గా నేడు 2 కోట్ల 18 లక్షల ఎకరాలు సాగవుతున్నదని, 37 లక్షల టన్నుల నుండి 2 కోట్ల 30 లక్షల టన్నుల పంట దిగుబడి సాధిస్తూ దేశానికే తలమానికంగా మన రాష్ట్రం నిలుస్తుందని అన్నారు. రైతు బంధు కింద జిల్లాలో 11 విడతలలో 2,96,452 మంది రైతులకు 2,501 కోట్ల రూపాయలు అందించామని, రైతు భీమా క్రింద 5,895 మంది నామినీలకు 295 కోట్లు అందించామన్నారు. 8,100 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా చేసుకొని 484 ఎకరాలలో సాగుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 642 చెరువులలో 2 కోట్ల 70 లక్షల చేప,రొయ్య పిల్లలను వదిలామన్నారు. గొల్ల , కురుమలను ఆదుకునేందుకు రెండో విడతలో 6,384 యూనిట్లకు గాను ఇప్పటి వరకు 2,890 యూనిట్లు గ్రౌండ్ చేశామని శాసనసభా పతి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని నిజాంసాగర్, పోచారం ప్రాజెక్ట్, కౌలాస్ నాలా ప్రాజెక్ట్ లు నిండాయని, ఆ ప్రాజెక్ట క్రింద ఉన్న ఆయకట్టుకు నీరందించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో 1,69,231 మంది లబ్దిదారులకు ప్రతి నెల 35 కోట్ల 99 లక్షలు అందిస్తున్నామన్నారు. దళిత బంధు కింద నియోజక వర్గంలో 1100 చొప్పున యూనిట్లకు ఆర్థిక సహాయం అందించనున్నామన్నారు. కళ్యాణ లక్ష్మి షాదిముబారక్ క్రింద ఇప్పటి వరకు 43,132 మంది లబ్దిదారులకు ఆర్థిక సహాయం అందించామన్నారు.

698 మంది మైనారిటీలకు త్వరలో లక్ష రూపాయల చొప్పున 6 కోట్ల 98 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించనున్నామన్నారు. బిసి కుల,చేతి వృత్తుల వారికీ నియోజక వర్గంలో 300 మంది చొప్పున ప్రతినెలా అందించనున్నామన్నారు. 5 వేల మంది గిరిజనులకు 11,365 ఎకరాలకు సంబంధించి పట్టాలు పంపిణి చేశామని, వారు రైతుబంధు పొందుదుతున్నారని అన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాల, బాన్సువాడలో నర్సింగ్ కళాశాల మంజూరు వల్ల వైద్య విద్య మరింత అందుబాటులోకి వచ్చిందని అన్నారు. చిన్నారులకు తల్లిపాలు, ముర్రుపాలు పట్టించడంలో దేశంలో బాన్సువాడ మాత శిశు ఆసుపత్రి నాల్గవ స్థానంలో నిలిచిందని, పిల్లలు ఆరోగ్యగా ఎదగాలంటే తప్పనిసరిగా ముర్రుపాలు పట్టాలని అన్నారు. పల్లె దవాఖానాలు ఏర్పాటు ద్వారా నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు. గత సంవత్సరం 9 వేల స్వయం సహాయక సంఘాలకు రూ.629 కోట్ల బ్యాంకు లింకేజి, స్త్రీ నిధి క్రింద 9,614 మంది సభ్యులకు రూ.72 కోట్ల 56 లక్షలు అందించామన్నారు. రోడ్ల మహర్దశకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిచ్చి కోట్లాది రూపాయలు మంజూరు చేసిందని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు శాఖ రాష్ట్రంలో ముందంజలో ఉందని అన్నారు.

అనంతరం జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేశారు. విశిష్ట సేవలు చేసిన అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎస్సి కార్పొరేషన్ దళిత బంధు పథకంపై ఏర్పాటు చేసిన శకటం ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ పాఠశాల విద్యార్థినీలు, విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలు, దేశభక్తిని పెంపొందించే విధంగా ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను స్పీకర్ పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పి చైర్ పర్సన్ శోభ, శాసనసభ్యులు జాజల సురేందర్, హనుమంతు షిండే, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ ముజీబుద్దీన్, అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్రమోహన్, మునిసిపల్ చైర్ పర్సన్ జాహ్నవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర రావు, జెడ్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





ప్రశంసాపత్రాలు అందజేస్తున్న స్పీకర్, ప్రజాప్రతినిధులు, అధికారులు... సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా అలరించిన విద్యార్థుల నృత్యం.. కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కరోనా వారియర్స్‌కి ఇచ్చే గౌరవం ఇదేనా?

- శాశ్వత స్వభావం కలిగిన పనిలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఇంకెంత కాలం పని చేయిస్తారు?
- సీఐటీయూ ఆధ్వర్యంలో సెకండ్ ఏఎన్ఎంల సమ్మె ప్రారంభం



సమ్మె చేపట్టి నినాదాలు చేస్తున్న రెండో ఏఎన్ఎంలు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

'కరోనా కష్టకాలంలో ప్రజల ప్రాణాలను కాపాడడంలో తెగించి పని చేసిన కరోనా వారియర్స్‌కి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా?. శాశ్వత స్వభావం కలిగిన పనిలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఇంకెంత కాలం పని చేయిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ప్రశ్నించారు. తెలంగాణ యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వైద్య శాఖలో పని చేస్తున్న రెండో ఏఎన్ఎంల నిరవధిక సమ్మెను మంగళవారం ప్రారంభించారు. నగరంలోని హమాల్‌వాడీ వద్ద గల సీఐటీయూ కార్యాలయం వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి అనంతరం సమ్మెను ప్రారంభించారు. నిరవధిక సమ్మెకు టీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర అధ్యక్షులు భాను కిరణ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరాజ్ సంఘీభావం తెలిపారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరినీ రెగ్యులర్ చేయాలని, కొత్తగా పోస్టులు భర్తీ చేయడానికి ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అర్బన్ హెల్త్ సెంటర్లు లలో పని చేస్తున్న సిబ్బంది మొదట స్వచ్ఛంద సంస్థ కింద పని చేశారని, ఆరు సంవత్సరాల కాలం పోరాటం, సమ్మెలు చేసిన అనంతరం కాంట్రాక్టు వ్యవస్థలోకి రాగలిగారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రభుత్వం ఇవ్వబోయే పీఆర్సీలో పర్మినెంట్ ఎంప్లాయిస్ కి సమానంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే 20 సంవత్సారాలకు పైగా పని చేస్తున్న ఏఎన్ఎంలను సీనియారిటీ ప్రాతిపదికన నియమించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా అనేక రంగాల్లో సీఐటీయూ నాయకత్వంలో సమ్మె లు, పోరాటాలు జరిగాయని, విజయాలు కూడా సాధించామని అన్నారు. కార్మికుల ఐక్యత ముందు ఏ ప్రభుత్వమైనా, పాలకులైనా దిగి రావాల్సిందేనని ఆమె అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు ఐదు వేల మంది ఉన్నారని, ఐదు వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఈ సమ్మె జరుగుతుందని ఆమె అన్నారు.

కరోనా వంటి భయానక వాతావరణంలో ప్రజల ప్రాణాలను రక్షించేందుకు తమ ప్రాణాలను పనంగా పెట్టి పని చేసిన యోధులని, ఇటువంటి వారిని రాష్ట్ర ప్రభుత్వం మరచిపోవడం ఏ మాత్రం తగదని హితవు పలికారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ అయ్యే వరకు సమ్మె పోరాటం కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు పుష్ప, కవిత, స్వర్ణ, దన సరోజ, అనిత, విట్టా బాయ్ తదితర ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బిల్లులు రాక.. అప్పులు తీర్చలేక మహిళా సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలింపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్ లావణ్యను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

నవతెలంగాణ-మాక్లూర్

అప్పులు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టినా.. బిల్లులు రాక అప్పులొల్ల వేధింపులు భరించలేక నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలం కల్లెడ గ్రామ మహిళా సర్పంచ్ మంగళవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబీకులు ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. స్థానికుల వివరాల ప్రకారం.. కల్లెడ సర్పంచ్ పెద్దగాని లావణ్య(34) సుమారు రూ.30 లక్షల మేర పలువురి వద్ద అప్పుగా తీసుకొచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారు.

వివరాలు మెయిన్‌లో..

కులవృత్తులకు వెన్నుముక.. సీఎం కేసీఆర్

- రూ.లక్ష చెక్కుల పంపిణీలో ఎమ్మెలే బిగాల

నవతెలంగాణ-నిజామాబాద్

కులవృత్తులకు సీఎం కేసీఆర్ మెన్నుముక లాగా నిలుస్తున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్త అన్నారు. నగరంలోని నూతన అంబేద్కర్ భవన్‌లో కులవృత్తులకు రూ.లక్ష రుణాల చెక్కుల పంపిణీని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులవృత్తులకు లక్ష రూపాయల రుణాల పంపిణీ పథకం నిరంతర ప్రక్రియ అని, లబ్దిదారులందరికీ అందేలా ప్రతినెలా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి దండు నీతు కిరణ్, నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సూదం రవి చందర్, సత్య ప్రకాష్, సిర్ప రాజు, మల్లేష్ యాదవ్, ఖైఖాన్ మధు, ధర్మపురి, సాయి వర్ధన్, రాఘవేందర్, నిచెంగు కృష్ణ పాల్గొన్నారు.


లబ్దిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, మేయర్

పదోతరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ (డి) పాఠశాలలో బయోజం పురుగుల మందుల కంపెనీ పదో తరగతి విద్యార్థు ల్లో పదిమందికి 2500 చొప్పున స్కాలర్‌షిప్‌ను మంగళవారం పంపిణీ చేసినట్టు ఉప సర్పంచ్ యెంకనోల్ల రమేష్ తెలిపారు. రాంపూర్ గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహ ఫర్టిలైజర్ తరపున రమేష్ స్కాలర్ షిప్ ఇప్పించడంలో ప్రత్యేక కృషి చేసినట్టుసర్పంచ్ పాపాయి తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పోతర్ల సుజాత రవి, విడిసి అధ్యక్షులు రాజ్ కుమార్, సొసైటీ చైర్మన్ తరచంద్ నాయక్, వసుధ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి గంగాధర్, సంపత్, బయోజం కంపెనీ సేల్స్ ఆఫీసర్ కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమం



పరేడ్‌గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపిస్తున్న మంత్రి, అధికారులు, ప్రజాప్రతినిధులు

- రాష్ట్రంలో సంక్షిష్ట పరిస్థితుల నుంచి సుభిక్షం వైపు పయనం
- సాగులో దేశంలోనే తెలంగాణ ముందంజ
- స్వాతంత్ర్య దినోత్సవ సంబురాల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- ఉత్సాహంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

'స్వాతంత్ర్యం సిద్ధించి 76 సంవత్సరాలు పూర్తి అయినది. ఈ 76 సంవత్సరాలలో భారతదేశం అనేక రంగాలలో అభివృద్ధి సాధిస్తూ భిన్నత్వంలో ఏకత్వాన్ని నిరూపించుకుంటూ ప్రపంచ దేశాలకు తమ సత్తా చాటిచెప్తూ ముందుకు సాగుతున్నది. ఈ సందర్భంగా స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వారిని స్మరించుకోవడం మన విధి. స్వాతంత్ర్యం ఏర్పడే నాటికి భారత దేశం చిన్న చిన్న రాష్ట్రాలుగా విభిన్న భాషలు, విభిన్న ప్రాంతాలు, వ్యక్తుల మధ్య అసమానతలతో నిండి ఉంది. స్వాతంత్ర్యం అంటే ప్రతి పౌరుడికి కనీస సౌకర్యాలైన కూడు, గూడు, గుడ్డ లభించేలా ఉండడం తమ కాళ్ళపై తాము స్వేచ్ఛాయుతంగా ఎదగడం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాడు రాష్ట్రం అనేక రంగాలలో సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటూ ఉన్నది. అలాంటి పరిస్థితుల నుండి రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రజలను అభివృద్ధి పథం వైపు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముందుం డి నడిపిస్తూ ఉన్నారు. నేడు రాష్ట్రం వ్యవసాయ రంగంలో దేశంలోనే ఉన్నత స్థానానికి చేరింది. అలాగే సంక్షేమానికి, అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ దేశంలోనే రాష్ట్రం ముందంజలో ఉన్నదని' మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మంత్రి వేముల, పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజనుద్దేశించి ప్రసంగించారు.

వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా కొనసాగిన శకటాల ప్రదర్శనను తిలకించారు. నీటి పారుదల, వ్యవసాయ, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, విద్యుత్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఐసీడీఎస్, పశుసంవర్ధక, వైద్యారోగ్య, పోలీస్, రెడ్ క్రాస్ శకటాలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు బహూకరించారు. ప్రభుత్వం వివిధ పథకాల కింద మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని లబ్దిదారులకు పంపిణీ చేశారు.

పంద్రాగస్టు వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింప జేశాయి. ఎదనిండా దేశ భక్తిని నింపుకుని జాతీయ స్ఫూర్తి పెంపొందేలా ఆకట్టుకునే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆహుతుల మన్ననలు అందుకున్నారు. బాల్కొండ కేజీబీవీ విద్యార్థినులు జయహో జయహో గీతంపై, విశ్వవికాస్ హై స్కూల్ బాలలు ముచ్చటైన మన ఊరి కథ గీతం పై సంప్రదాయ వస్త్ర ధారణతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చిన్నారులను మంత్రితో పాటు అతిథులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. వేడుకలను పురస్కరించుకుని జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మంత్రి ప్రశాంత్ రెడ్డి రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ వేడుకల్లో జెడ్పి చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్తా, ఆశన్నగారి జీవన్ రెడ్డి, నగర మేయర్ నీతూకిరణ్, డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేశ్వర్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా జడ్జి కె.సునీత, ఐడీసీఎంఎస్ చైర్మన్ మోహన్, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరందు, డీ.సీ.పీ గిరిరాజ, అదనపు డీసీపీ జయరాం, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.


నిజామాబాద్ కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించిన కలెక్టర్..



పరేడ్‌గ్రౌండ్‌లో బాల్కొండ కేజీబీవీ విద్యార్థుల నృత్యం


ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి, కలెక్టర్


స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానిస్తున్న మంత్రి

సంపూర్ణ స్వతంత్ర్యం సిద్ధించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్థిక, సమానత్వ, సంపూర్ణ స్వాతంత్రం సిద్ధించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం చేపట్టారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వాలంటరీ బ్లడ్ సెంటర్‌లో మంగళవారం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ బ్రిటిషర్ల నుండి అర్ధ స్వాతంత్రం వచ్చిందని సంపూర్ణ స్వాతంత్రం కోసం అందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజల అందరికి స్వతంత్ర ఫలాలు అందేలా పాలక ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. స్వతంత్రం వచ్చి 76 ఏండ్లు గడిచినా కుల ప్రాంతీయ అసమానతలు తగ్గలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం నా జన్మ హక్కు అని మర్మోగిన నినాదాలను గుర్తు చేశారు. మీ రక్తం ఇవ్వండి దేశానికి స్వాతంత్రం ఇస్తానని సుభాష్ చంద్రబోస్ సూక్తులను.. భగత్ సింగ్ తెగువ, త్యాగాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వమని స్వాతంత్ర ఉద్యమంలో విద్యార్థులు గొంతెత్తరని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్, డివిజన్ కార్యదర్శి సిద్ధాల నాగరాజు, డివిజన్ అధ్యక్షులు జవహర్ సింఘ్,డివిజన్ నాయకులు అర్వింద్, ప్రశాంత్, సాయి కుమార్, గణేశ్, తదితరులు రక్తదానం చేశారు.

విద్యార్థులకు తాటిపత్రిల వితరణ

నవతెలంగా4ణ-ఆర్మూర్



ఆలూరు మండల కేంద్రంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా విద్యార్థులు నేలపై కూర్చోవడం చూసి అప్పటికప్పుడు 5వేల రూపాయల విలువ చేసే రెండు తాటిపత్రిలు విరాళంగా అందజేసినట్టు మండల బీఆర్ఎస్. అధ్యక్షుడు ఆలూరు శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో, సర్పంచ్ కళ్లెం మోహన్, వీడీసీ అధ్యక్షుడు బార్ల గణపతి, ఎస్ఎంసి చైర్మెన్ వెల్మ గంగారెడ్డి, వార్డు మెంబర్ మర్కంటి మహేష్, ప్రధానోపాధ్యాయురాలు హరిత, తదితరులు పాల్గొన్నారు.

కండ్లద్దాలు పంపిణీ

నవతెలంగాణ-ఏర్గట్ల



కండ్ల కలక అతిగా వ్యాపిస్తున్న నేపథ్యంలో తొర్తి గ్రామ సర్పంచ్ కుండ నవీన్ తన స్వంత ఖర్చులతో 90 మంది విద్యార్థులకు కళ్ళ అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... కళ్ళ కలక విద్యార్థులను చాలా ఇబ్బంది పెడుతుందని, విద్యార్థులు జాగ్రత్తలు వహించాలని కోరారు. ఇందులో భాగంగా వైస్ ఎంపీపీ సల్ల లావణ్య, ఉపసర్పంచ్ తాహెర్, ప్రధానోపాధ్యాయులు మధుర, శంకర్, ఎస్ఎంసి చైర్మన్ మాలేపు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా 'స్వాతంత్ర్య' వేడుకలు



కంఠేశ్వర్: ట్రాలీ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో..

నవతెలంగాణ-విలేకరులు

76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్కూళ్లతో పాటు మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, తదితర కార్యాలయాల్లో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎస్ఐలు జెండాలను ఎగురవేశారు. పార్టీకార్యాలయాలు, సింగిల్ విండో కార్యాలయాల, అటవీ రేంజ్, విద్యాశాఖ, పశు వైద్య కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఎగురవేశారు. పంచాయతీ కార్యాలయల్లో సర్పంచ్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్మికసంఘాలు, కుల సంఘాలు, యువజనసంఘాల ఆధ్వర్యంలో జెండా పండుగను నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులు ర్యాలీలు, నృత్యాలతో అలరించారు. స్వాతంత్ర్య దినోత్సవన్ని పురస్కరించుకొని పాఠశాలల్లో నిర్వహించిన ఆటల పోటిల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



బాల్కొండ :శాంభవి పాఠశాలలో...



నిజామాబాద్‌సిటీ : న్యాల్‌కల్ రోడ్‌లోని హోవర్డ్ హై స్కూల్లో ..



కమ్మర్‌పల్లి : ఎంపీడీవో కార్యాలయంవద్ద..



జక్రాన్‌పల్లి : బ్రాహ్మణపల్లి జీపీలో..



ఆర్మూర్ : ఆల్‌ఫోర్స్ నరేంద్రలో..



నిజామాబాద్ రూరల్ : మండల కార్యాలయంలో..



ఆర్మూర్: ఆశాసూపర్ స్పెషాలిటీ ఆస్పటల్లో...



డిచ్‌పల్లిలో...



కంఠేశ్వర్: ఐద్వా ఆధ్వర్యంలో..



కమ్మర్‌పల్లిలో..



నిజామాబాద్‌సిటీ : టీడీపీ ఆధ్వర్యంలో..



కంఠేశ్వర్ :రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..



సిరికొండలో..



నిజామాబాద్‌సిటీ : బీజేపీ ఆధ్వర్యంలో..



మాక్లూర్‌లో..



నిజామాబాద్‌రూరల్ : సారంగాపూర్ బీఈడీ కళాశాలలో..



నందిపేట్ : బుద్ధవనంలో జెండా ఎగురవేసిన అంబేద్కర్ నాయకులు



మోపాల్ : ఎంపీడీవో ఆఫీసువద్ద



మోర్తాడ్‌లో..

అటవీ శాఖ అధ్వర్యంలో షాట్ ఫిలిం చిత్రీకరణ



షాట్‌ఫిలింలో ఓదృశ్యం చిత్రీకరణ సందర్భంగా..

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని కమ్మర్‌పల్లి అటవీ రేంజ్ కార్యాలయంలో షాట్ ఫిలింను అటవీ రేంజ్ అధికారి రవీందర్ మంగళవారం ప్రారంభించారు.77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడులను పురస్కరించుకొని కమ్మర్‌పల్లి రేంజ్ అటవీ శాఖ వారి అధ్వర్యంలో ఈ షాట్ ఫిలిమ్ చిత్రికరణ చేపట్టారు. ముహుర్తం షాట్‌ను రేంజ్ అధికారి రవీందర్, డిప్యూటి రేంజ్ అధికారి తుక్కారామ్ రాథోడ్, బీట్ అధికారి లింగన్న, సిబ్బందిపై చిత్రీకరించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి రవీందర్ మాట్లాడుతూ అటవీ సంపద, వన్యప్రాణులు, అటవీ భూములపై, వన్యప్రాణులను వేటాడే వేటగాగళ్లపై, కలప వృక్ష సంపదను స్మగ్లింగ్ చేసే వారిని పట్టుకునే సందర్భంలో అధికారులు పడే కష్టాలపై షాట్ ఫిలిమ్ తీస్తున్నట్లు తెలిపారు. అడవుల సంరక్షణలో ప్రజలను చైతన్య పరిచేందుకే ఈ షాట్ ఫిలిమ్ తీయిస్తున్నట్లు వివరించారు. త్వరలో ఈ షాట్ ఫిలిమ్‌ను యూట్యూబ్, ఇతర సామాజిక మధ్యమాల ద్వారా ప్రజల ముందుకు తీసుకు వస్తామన్నారు. ఈ షాట్ ఫిలిమ్‌కు డైరెక్టర్‌గా ముద్రవేణి హన్మాండ్లు, కథ,మాటలు దాకూరి చరణ్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా అటవీ శాఖ సిబ్బందిపై సమీపంలోని అటవీలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు.

హై స్కూల్‌కు కంప్యూటర్ విరాళం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ హైస్కూల్‌కు కొలిప్యాక్ సింగిల్ విండో అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ కంప్యూటర్‌ను విరాళంగా ఇచ్చారు. హై స్కూల్‌లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రధానోపాధ్యాయులకు కంప్యూటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దీకొండ హరిత శ్రీనివాస్ సర్పంచ్ ఆత్మకూరు గంగు, మండల రైతు బంధు అధ్యక్షుడు దికొండ శ్రీనివాస్, టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బాలయ్య, విడిసి సభ్యులు సింగిల్ విండో డైరెక్టర్లు, యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్ఐగా ఎంపికైన ప్రణయ్‌కు సన్మానం



ఎస్ఐగా ఎంపికైన ప్రణయ్‌నుసన్మానిస్తున్న సర్పంచ్, తదితరులు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని బాచన్‌పల్లి గ్రామానికి చెందిన పిల్లి ప్రణయ్ ఇటీవలే ఎస్సైగా ఎంపికవ్వడంతో మంగళవారం స్వాంత్రంత్ర దినోత్సవాన్ని సర్పంచ్ ఆకుల కవితగంగాదర్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. మారుమూల గ్రామంనుంచి పట్టుదలతో చదివి ఎస్సైగా ఎంపికైన ప్రణయ్‌ను యువకులు ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందకు సాగాలని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంజయ్, పాలక వర్గం బాలయ్య, రణధీర్, గాండ్ల రవి తదితరులు పాల్గొన్నారు

లిల్లీపుట్ పాఠశాలలో ఆకట్టుకున్న స్వతంత్ర దినోత్సవ సంబరాలు

నవతెలంగాణ-ఆర్మూర్



రాణి రుద్రమ వేషాధారణలో..

లిల్లీపుట్ పాఠశాలలో 77వ స్వతంత్ర దినోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు వివిధ రంస్కతిక కార్యక్రమాలు దేశభక్తి గేయాలు ఉపన్యాస పోటీల్లో చక్కగా పాల్గొన్నారు. తదనంతరం వీరికి పాఠశాల కరస్పాండెంట్ రామకష్ణ, ప్రిన్సిపల్ దాసు బహుమతులు అందజేశారు. చిన్నారులందరు రాణిరుద్రమ దేవి, భరతమాత, అంబేద్కర్, వివిధ ఫ్రీడమ్ ఫైటర్ల వేషాల్లో రావడంతో ప్రాంగణం విశేషంగా కనిపించింది. పిరమిడ్ తో విద్యార్థులందరూ భరతమాతకు చక్కగా సెల్యూట్ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ దాసు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

9.5 జీపీఏ విద్యార్థులకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో 9.5 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని లాలన వద్ధాశ్రమ వ్యవస్థాపకుడు పైపుల రాజిరెడ్డి మంగళవారం అందజేశారు. స్వతంత్ర దినోత్సవం సందర్భంగా లాలన వద్ధాశ్రమ వ్యవస్థాపకుడు శ్రీ పైపుల రాజారెడ్డి గత సంవత్సరం 9.5 సాధించిన ముగ్గురు విద్యార్థులు వెన్నెల, వైశాలి, వైష్ణవ్‌లకు 5000 రూపాయలు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, ఎంపీటీసీలు గంగారెడ్డి, మరియ సతీష్ , పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ వేణు కుమార్ మరియు పాఠశాల బందం తదితరులు ఉన్నారు.

ఆర్మీ జవాన్లకు సన్మానం

నవతెలంగాణ-భీంగల్

స్వాంతంత్ర దినోత్సవాన్ని పుసర్కరిచుకుని మండలంలోని మెండోరా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆర్మీలో పనిచేస్తున్న కల్లెడ నరేష్, బాణావత్ కళ్యాణ్, బాణావత్ తిరుపతిలను సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇండియన్ ఆర్మీలో సేవలను అందిస్తున్న వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని గ్రామపెద్దలు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేధర్. యంపిటీసి ఆరె లావణ్య రవీంధర్,ప్రదానోపాద్యాయురాలు సుజాత, ఎస్ఎంసీ చైర్మన్ రాజు, విడీసి అధ్యక్షుడు రాజేశ్వర్‌గౌడ్, ఐకెపి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం డబుల్ బెడ్ రూంల అర్హుల జాబితాపై గ్రామసభ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. అర్హుల జాబితా డ్రా పద్ధతిన తహసీల్దార్, ప్రజాప్రతినిధుల సమక్షంలో తీయబడుతుందని డీటి తెలిపారు.

నవతెలంగాణ
కామారెడ్డి
3
బుధవారం 15 ఆగస్టు 2023

వచ్చేనెల 2న కాంగ్రెస్ జాబ్‌మేళా

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

సెప్టెంబర్ 2న మదన్‌మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్ తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇంత వరకు గెలిచిన ఏ నాయకుడు ఇలాంటి సేవ కార్యక్రమాలు చేయలేదన్నారు. రానున్న రోజుల్లో కూడా మదన్ మోహన్ ట్రస్ట్ ద్వారా మరెన్నో కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ జాబ్ మేళాలో 26 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బోర్గంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గాం గ్రామంలో హిందూ బ్లడ్ డోనర్స్ ఫౌండర్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరంలో 20 మంది దాతలు ముందుకు వచ్చారని బ్లడ్ డోనర్స్ ఫౌండర్ మసూద్ పేర్కొన్నారు. రక్తదానమే ప్రాణదానమని ప్రతి ఒక్క యువత రక్తదానాన్ని ఇవ్వడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లలిత, వినీత, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీదేవి, రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ ఉపాధ్యక్షులు అశ్వక్ హైమద్, సర్పంచ్ వాణి సాయిరెడ్డి, జెడ్పీటీసీ మేక విజయ సంతోష్, ఎంపీటీసీ రుక్మిణి, రెంజల్ సింగిల్ విండో చైర్మన్ మొహీనుద్దీన్, పార్థరాజు, సిద్ధ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన జెండా


బిచ్కుంద : జెండావందనం చేస్తున్న ఎమ్మెల్యే


గాంధారి : గాంధీ వేషాధారణలో..


ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జెండావిష్కరణ..


ఎడపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో..


ఎడపల్లి : వడ్డేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

జాతీయ పతాకం రెపరెపలాడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, పార్టీల కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల వద్ద జెండాను ఎగురవేశారు. చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషాధారణలో అలరించారు.


బోధన్ : మండల పరిషత్ కార్యాలయం వద్ద..


బోధన్‌టౌన్ : జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే షకీల్


దోమకొండ : జెండావందనంలో పాల్గొన్న పలువురు


లింగంపేట్ : ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద


మద్నూర్ : మహనీయుల వేషాధారణలో చిన్నారులు


కోటగిరి : తహసీల్దార్ కార్యాలయం వద్ద..


పెద్దకొడప్‌గల్ : ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ..


పిట్లంలో జెండావందనం చేస్తున్న పలువురు


రెంజల్‌లో..


సదాశివనగర్ : సీఐ కార్యాలయం ఎదుట



తాడ్వాయి : రవీంద్రభారతి హైస్కూల్‌లో..


ఎడపల్లి: కాంగ్రెస్ ఆధ్వర్యంలో..


ఎల్లారెడ్డి : గండిమాసానిపేట్‌లో..

సభాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే షకీల్

నవతెలంగాణ-బోధన్‌టౌన్


సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ క్రీడా స్థలంలో నిర్వహించబోయే బూత్ స్థాయి ప్రత్యేక సమావేశం సభాస్థలిని బోధన్ ఎమ్మెల్యే షకీల్ మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లను సక్రమంగా చేయాలని నాయకులకు సూచించారు. సమావేశానికి హాజరుకానున్న బూత్ కమిటీ సభ్యులకు, నాయకులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పరిశీలించారు. ఏర్పాట్లను సక్రమంగా చేయాలని నాయకులకు సూచించారు. సమావేశానికి హాజరుకానున్న బూత్ కమిటీ సభ్యులకు, నాయకులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లను చేయనున్నట్లు ఎమ్మెల్యే షకీల్ అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఇప్పుడు గుర్తుకొచ్చిందా కేటీఆర్..?

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మంత్రి కేటీఆర్‌కు ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ ప్రశ్నించారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్ మాట్లాడుతూ.. సోమవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ బహిరంగసభలో నియోజకవర్గంపై ఎనలేని దొంగ ప్రేమను కనబరిచారని ఆరోపించారు. ఎలక్షన్లు వస్తున్న సందర్భంగా ఇప్పుడు ఎల్లారెడ్డి గుర్తుకు వచ్చిందా అని అన్నారు. ఎలక్షన్స్‌కు ముందు కేసీఆర్, కేటీఆర్‌ను సంప్రదించాకే ఎమ్మెల్యేగా పోటీ చేసానని ప్రజల ముందు స్వయంగా మన ఎమ్మెల్యే ఒప్పుకున్నారంటే ప్రజలను మోసం చేయాలని ముందే ఫిక్స్ అయ్యారని అన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి జరగని అభివృద్ధి ఇప్పుడు జరుగుతుందా అని ప్రశ్నించారు. నేటి వరకు నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూం కూడా ఇవ్వలేదని, నిరుద్యోగులకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి జాడే లేదని అన్నారు. పంట నష్టపోయిన రైతుల ప్రస్తావన లేదని వివరించారు. భూంపల్లి డ్యామ్ పూర్తి చేస్తామన్న హామీని తుంగలో తొక్కిన ఎమ్మెల్యే, కార్యకర్తల డబ్బులతో నామినేషన్ వేసి నేడు కాంగ్రెస్ వాళ్ళు ఎవరు అని దొంగ మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే సురేందర్‌కు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చెన్న లక్ష్మణ్, ఆరిఫ్, క్రిస్టోఫర్, నారాగౌడ్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు అజర్, నాయకులు సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మదన్‌మోహన్

మంజీరాలో దూకి యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-కోటగిరి

పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామానికి చెందిన పి.బీరుగొండ (24) అనే యువకుడు ఈ నెల 14న సోమవారం మధ్యాహ్నం కుటుంబ కలహాలతో గ్రామ శివారులోని మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు గాలింపు చేపట్టగా మంగళవారం మృతదేహం లభ్యమైంది. తల్లి సత్తవ్వ ఫిర్యాదు మేరకు ఎస్సై సందీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించారు.

బోధన్‌లో గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-బోధన్ టౌన్

బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అర్హులైన అభ్యర్థుల నుంచి సోమవారం గృహలక్ష్మి దరఖాస్తులను స్వీకరించారు. అర్హులైన వారు త్వరితగతిన దరఖాస్తులను సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో హున్సా ఎంపీటీసీ శివకుమార్, శంకర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శబరి ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా రాజారాం బాలయ్య


ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-లింగంపేట్

పట్టణ శబరి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా రాజారాం బాలయ్యను సంఘం సభ్యులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవం నాడు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ఇందులో భాగంగానే గత సంవత్సరం పనిచేసిన దురిశెట్టి అశోక్ పదవీ కాలం పూర్తి కావడంతో మంగళవారం సంఘం భవనంలో సమావేశం నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యుల అభిప్రాయం మేరకు ఎన్నుకున్నారు.

ఉపాధ్యక్షులుగా బొల్లారం క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శిగా శెట్టిపల్లి కృష్ణ, ప్రచార కార్యదర్శిగా దాసరి అనిల్ కుమార్, స్పీకర్ రాజారాం, సంగయ్య, కోశాధికారిగా గంట్లమ్మ, బొట్ల అనిల్‌తో పాటు ఎనిమిది మంది సలహాదారులను ఎన్నుకున్నారు. వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షునికి, కార్యవర్గ సభ్యులకు శాలువా కప్పి పూలదండ వేసి ఘనంగా సన్మానించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, సంఘం సభ్యులు సహకరించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల గౌరవ అధ్యక్షులు బొల్లారం సాయిలు, మాజీ అధ్యక్షులు దురిశెట్టి అశోక్, శ్యామంతుల వెంకటి, పోచయ్య, మంద కృష్ణయ్య, పెంటయ్య, అంజయ్య, రమేష్, నరేష్, సురేష్, భాస్కర్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోను కలిసిన టీఎన్జీవోస్ యూనిట్ బృందం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్జీవోస్ ఎల్లారెడ్డి తాలూకా యూనిట్ బృందం లచ్చిగారి మహిపాల్ అధ్యక్షతన ఎల్లారెడ్డి ఆర్డీఓ రమేష్ రాథోడ్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో శరన్‌కుమార్, రవీందర్, రాజాగౌడ్, శ్రీకాంత్, స్వాతి, నర్సింగ్‌రావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ గ్రామానికి చెందిన జూకంటి హరీష్‌రెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు. ఇటీవల ఎస్సై ఫలితాలలో ఎ.ఆర్.ఎస్సైకి ఎంపికైన ఆయనను సన్మానించినట్లు ఇన్‌చార్జీ ఎం.ఈ.ఓ యోసఫ్ తెలిపారు.

రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-రెంజల్

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో ఎంపీపీ రజనీ కిషోర్, సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, ఎంపీడీఓ శంకర్, గ్రామ కార్యదర్శి రాజేందర్ రావు మొక్కలు నాటారు. కార్యక్రమంలో వీరన్నగుట్ట ఎంపీటీసీ గంగ లత, తాడ్‌బిలోలి ఎంపీటీసీ చింతకుంట లక్ష్మి, ఉపసర్పంచ్ అన్నం గంగామణి, పాలకవర్గ సభ్యులు, అంగన్వాడీ కార్యకర్త సురేఖ, క్షేత్ర సహాయకులు శోభన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎడపల్లి డిప్యూటీ తహసీల్దార్‌కు మెదక్ తహసీల్దార్‌గా పదోన్నతి

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నారాయణకు పదోన్నతి లభించింది. డిప్యూటీ తహసీల్దార్‌గా ఏడాదిన్నర క్రితం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించినట్లు ఆయన తెలిపారు. దీంతో ఆయన మెదక్ జిల్లాకు తహసీల్దార్‌గా వెళ్ళనున్నారు.

రచ్చ జగన్నాథ్ స్మారక ప్రతిభా పురస్కారాల ప్రదానం



నవతెలంగాణ-మద్నూర్

రచ్చ జగన్నాథ్ స్మృతి సమితి ఆధ్వర్యంలో రచ్చ జగన్నాథ్ స్మారక ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి మండల స్థాయిలో మొదటిగా నిలిచిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మద్నూర్ విద్యార్థిని పాండాల్‌వార్ భూమికను గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం, మెమెంటో, నగదు బహుమతిని జగన్నాథ్ స్మృతి సమితి వ్యవస్థాపకులు రచ్చ శివకాంత్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శివకాంత్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఇదేవిధంగా గోల్డ్ మెడల్‌తో పాటు నగదు బహుమతి అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మద్నూర్ సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి రచ్చ కుషాల్, ఉపసర్పంచ్ విట్టల్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుతి, మద్నూర్ సీనియర్ ఉపాధ్యాయులు సునీల్, సీఆర్‌పీ రచ్చ అశోక్, హన్మంతరావు, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యకర్తలను రెగ్యులర్ చేయాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలో గత పది సంవత్సరాలుగా ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేస్తున్న వారికి రెగ్యులర్ చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ రామచందర్ మంగళవారం అందజేశారు. రాత్రనకా, పగలనకా, వైద్య సేవలను నిరంతర అందిస్తున్న తమకు గుర్తింపు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వెంటనే రెగ్యులర్ చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు కళావతి, జమున, శ్యామల, శోభ, వసంత తదితరులు పాల్గొన్నారు.

పెంటాఖుర్దులో మహాత్మా గాంధీ విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతిపిత మహాత్మా గాంధీ నూతన విగ్రహాన్ని సర్పంచ్ వీరన్న పటేల్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాన్ని ఆలపించి స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి అనేక పథకాలను అమలుపరిచి ప్రజలకు సుపరిపాలన అందించి దేశ చరిత్రలో ఆదర్శంగా నిలిచిందని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో పలువురి చేరిక

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమెర్ సమక్షంలో కళ్ళ మహేందర్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని తట్టికోట్ 29 వార్డుకు చెందిన కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రుద్ర సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్ నాయక్, ఈరపురం పోశెట్టి, పిట్ల ఆబ్బయ్య పాల్గొన్నారు.

టాక్సీ డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ


జెండావిష్కరణలో నాయకులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బోధన్ పట్టణ టాక్సీ డ్రైవర్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పూర్తి చేసుకుని 77వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలు పరిష్కరించడంలో వైఫల్యం చెందాయన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేద ప్రజలు కులాలకు మతాలకు ప్రాంతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా పోరాటం చేసి బ్రిటిష్ వారిని తరిమికొట్టి దేశానికి స్వాతంత్రం తెచ్చారని, కానీ నేడు పాలనలో పరిపాలన చేస్తున్న కేంద్ర ప్రభుత్వం కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దేశంలో ఉన్న ప్రజలను ఐక్యంగా ఉంచకుండా కులాల పేరుతో మతాల పేరుతో ప్రాంతాల పేరుతో విడదీస్తూ.. లౌకికవాదాన్ని పీడనాడుతున్నారని అన్నారు. మూఢనమ్మకాలు, మూఢవిశ్వాసాలను వదిలేసి సైన్సును నమ్ముకుని శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో చదువుతో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బోధన్ పట్టణ టాక్సీ డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు మొయినుద్దీన్, కార్యదర్శి బషీర్ భాయ్, కోశాధికారి అజ్జుబాయ్, సలీం భాయ్, రఫిక్, గంగాధర్, రాములు, నరేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ సైనికుడికి సన్మానం


సదాశివనగర్ : సైనికుడికి సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్/లింగంపేట్

76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల మర్కల్‌లో "మేరా మట్టి మేరా దేశ్"లో భాగంగా ఆర్మీ సైనికుడికి సన్మాన వేడుక నిర్వహించారు. సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల మర్కల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేసి వందనాలు సమర్పించారు. ముఖ్య అతిథిగా భారత సైనికుడు ప్రశాంత్‌రెడ్డిని ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.మాణిక్య రేఖ, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పి.వనమాల, కల్చరల్ కోఆర్డినేటర్ ఉదయిని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సి.అనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలో భారత స్వాతంత్ర్య అమృత మహోత్సవాలలో సర్పంచ్ బొల్లు లావణ్య, ఎంపీపీ గరీబున్నీసా నయిమ్ ఆధ్వర్యంలో 75 మొక్కలు నాటి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద దేశం కోసం అమరులైన సైనికులకు, స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మేరీ దేశ్ మేరీ మట్టి కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి అమృతవాటికలో నుంచి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రభాకర్‌చారి, ఏపీఎం చామంతి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ విట్టల్‌రెడ్డి, ఎంపీటీసీ షమీమున్నిసా, ఏఎంసీ డైరెక్టర్ ఫతియొద్దీన్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నరహరి, కార్యదర్శి శ్రావణ్ కుమార్, వార్డు మెంబర్లు రమేష్, నరేష్, శ్రీనివాస్, జీపీ సిబ్బంది సాయిలు, శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ నాయకపోడు మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక


ఎన్నికైన ఆదివాసి నూతన కార్యవర్గం

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు మెట్ట పెంటయ్య తెలిపారు. అధ్యక్షులుగా ర్యావబోయిన కిషన్, ఉపాధ్యక్షులు మన్నెపు రాజు, ప్రధాన కార్యదర్శిగా కంది సంజీవ్, కోశాధికారిగా మన్నెపు రాజశేఖర్, సంయుక్త కార్యదర్శిగా జనార్ధన్, సాయిలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంది సాయిలు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ గ్రామాల నాయకపోడు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస

- ఉమ్మడి జిల్లాలో పలువురికి ప్రశంసాపత్రాలు అందజేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఉమ్మడి జిల్లాలోని ఉత్తమ ఉద్యోగులు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చేతుల మీదుగా మంగళవారం ప్రశంసాపత్రాలను అందుకున్నారు. వివిధ శాఖల అధికారులు వారు చేసిన సేవలకు గానూ.. ప్రభుత్వం వారిని ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి ప్రశంసాపత్రాలను అందజేసింది.

ఉత్తమ ఉద్యోగులుగా బిచ్కుంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్..

బిచ్కుంద : కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 77వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఉత్తమ ఉద్యోగినిగా బిచ్కుంద మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ, ఐకేపీ శ్రీనివాస్ శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్‌షిండే, జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. బిచ్కుంద డిగ్రీ కళాశాలలో వీరు చేసిన సేవలను గుర్తించి అవార్డులు అందజేసినందుకు గాను ఉపాధ్యాయ బృందం విద్యార్థులు సీపీడీసీ మెంబర్స్, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

కలెక్టర్ చేతుల మీదుగా పలువురికి ప్రశంస పత్రాలు..

లింగంపేట్ : మండలంలోని ఆయా శాఖలో పని చేస్తున్న అధికారులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందుకున్నారు. ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ మల్లేశం, పంచాయతీరాజ్ ఏఈ రాకేష్, లింగంపేట్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్, మండల రెవెన్యూ కార్యాలయం అటెండర్ రాములుకు విధి నిర్వహణతో పాటు వారి శాఖల్లో మెరుగైన సేవలు అందించినందుకు ప్రశంస పత్రాలతో పాటు అవార్డులు అందుకున్నారు.


గాంధారి : ఉత్తమ అవార్డు అందుకుంటున్న అధికారి

వివిధ శాఖల అధికారులకు ఉత్తమ అవార్డులు..

గాంధారి : మండల కేంద్రంలో లైన్‌మెన్‌గా గతంలో సేవలందించిన తిరుపతి ఉత్తమ లైన్‌మెన్‌గా ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని 108 వాహనంలో పనిచేస్తున్న ఈఎన్‌టీ సురేష్, పైలట్ నరేష్‌ను ఉత్తమ సేవలకు గాను స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు..

బోధన్‌టౌన్ : తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజయంతి, అడ్వకేట్ జనరల్ బండ వరప్రసాద్ జనవరి 23 నుంచి జూన్ 23 వరకు నిర్వహించిన కేసులను ప్రామాణికంగా తీసుకొని అత్యధికంగా కేసులలో శిక్షలు వేసిన బోధన్ కోర్టులోని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు డాక్టర్ పల్నాటి సమ్మయ్య ప్రశంసాపత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీ నరసయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

పద్మసింగ్‌కు ఉత్తమ పారాలీగల్ అవార్డు

బోధన్ : బోధన్ పట్టణంలోని రాకాసిపేటకు చెందిన సాయి ఆదర్శ మహిళా మండలి వ్యవస్థాపకురాలు పద్మ సింగ్ ప్రజలకు న్యాయ సేవ సలహాలు అందించడమే కాకుండా, కుటుంబ సమస్యలకు పరిష్కారం చూపుతూ, చట్టాలను వాటిపై అవగాహన కల్పించడంతో ఆమె సేవలను గుర్తించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ మంగళవారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత చేతుల మీదుగా పద్మాసింగ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ముగ్గురికి ప్రశంసాపత్రాలు అందజేత..

సదాశివనగర్ : 76వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సదాశివనగర్ మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామపంచాయతీ కార్యదర్శి హనుమాన్లు రాజు, మండలంలో పనిచేస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లు అయినా షేక్ అక్బర్, దీపక్‌లకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్లుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

అవార్డు అందుకున్న ఆరోగ్యం విస్తీర్ణ అధికారి..

రెంజల్ : మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్ అవార్డు అందుకున్నారు.

ఉత్తమ ఆయా అవార్డు అందజేత..

మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన ఆయా లావణ్యకు తన సేవలను గుర్తించి జిల్లా కలెక్టర్ రాజీవ్ హనుమంతు, పీడీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్టు ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి పేర్కొన్నారు. అంగన్వాడీ కార్యకర్త అనారోగ్యంతో ఉండడంతో పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు, అంగన్వాడీ కార్యకర్తల సేవలను అందించిన ఆయాకు మండలంలో ఉత్తమ అవార్డు వచ్చిందని ఆమె పేర్కొన్నారు.

అవార్డులను అందుకున్న ఎంపీఓ, పంచాయితీ కార్యదర్శి..

ఏర్గట్ల : మండల కేంద్రానికి చెందిన పంచాయితీ కార్యదర్శి సయ్యద్ జాకీర్ హుస్సేన్, ఎంపీఓ శివచరణ్ ఉత్తమ సేవలకు గాను మంత్రి ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి అవార్డులను అందించిన మంత్రి ప్రశాంత్ రెడ్డికి,డిపిఓ జయసుధకు కతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

బెస్ట్ ఆయాకు అవార్డు..

ఏర్గట్ల : గతకొన్ని సంవత్సరాలుగా తాళ్ళ రాంపూర్ అంగన్వాడీలో ఆయాగా సేవలందిస్తున్న కాపులూరి గంగు ఉత్తమ సేవలను గుర్తించిన ప్రభుత్వం, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి ప్రశాంత్ రెడ్డి,కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా ఉత్తమ ఆయా అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గంగు మాట్లాడుతూ... అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.


ఏర్గట్ల : ఆయాకు ప్రశంసాపత్రం అందజేత..



శాస్త్రవేత్త మహేందర్‌కు సన్మానం..

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన పద్మశాలి ముద్దుబిడ్డ డి. మహేందర్‌ను స్థానిక పద్మశాలీ సంఘం సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. మహేందర్ అమెరికాలో గొప్ప శాస్త్రవేత్త పేరు గడించారు. అమెరికాలో కరోనా వ్యాధికి మందు కనుగొన్న శాస్త్రవేత్తల బృందంలో మహేందర్ ఒకరు. ఇటీవల స్వగ్రామానికి విచ్చేసిన ఆయనను స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పద్మశాలి సంఘం సభ్యులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు రాజుల కష్ణమురళి మాట్లాడుతూ.... అమెరికాలో శాస్త్రవేత్తగా గొప్ప పేరు సంపాదించిన మహేందర్ గ్రామానికి చెందిన వ్యక్తి కావడం సంతోషకరమన్నారు. కరోనాకు ముందు కనుగొన్న బందం సభ్యుల్లో ఒకరైన మహేందర్‌ను సన్మానించుకోవడం మన పద్మశాలి సంఘ సభ్యుల అదష్టం అన్నారు. ఆయన సలహాలు, సూచనలు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు రాజుల గణేష్, కార్యవర్గ సభ్యులు రాజుల వివేకానంద్, సభ్యులు రాజుల నవీన్, తాళ్ల సురేందర్, టి. కిషన్, రాములు, కారపు లక్ష్మణ్, పద్మ శ్యామ్ కుమార్, విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటిన పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ, ఉప సర్పంచ్ మొక్కలను మంగళవారం నాటారు. సర్పంచ్ లతా దేవరాజు, ఎంపీటీసీ పోతే రాజు, ఉప సర్పంచ్, గ్రామ బుద్ధి కమిటీ ప్రెసిడెంట్ మొక్కలు నాటారు. గ్రామపంచాయతీలో సర్పంచ్ లతా దేవరాజు జాతీయ జెండాను ఎగరవేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గెలుపొందిన విద్యార్థులకు సర్పంచ్ బహుమతులను అందజేశారు.



కుల, చేతి వృత్తులను కాపాడతాం

- 15 కులవృత్తుల వారికి ఆర్థికసాయం
- ఉమ్మడి మండలంలో రూ.కోటి 75 లక్షలు పంపిణీ

నవతెలంగాణ-వర్ని

కుల, చేతి వృత్తులను ప్రభుత్వం కాపాడుతుందని, అందులో భాగంగానే ఆర్థికంగా బతకడానికి బీసీబంధు పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వర్ని మండల కేంద్రంలోని సీసీడీ ఫంక్షన్‌హాల్‌లో ఆరు మండలాలకు చెందిన కులవృత్తుల వారికి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 15 రకాల చేతివృత్తుల కులస్తులు ఉన్నారని, వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి రూ.లక్ష ఉచితంగా ఇవ్వడానికి కేసీఆర్ ముందుకువచ్చారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు కుల చేతి వృత్తుల వారి గురించి ఆలోచన చేయలేదని అన్నారు. ఉన్న ఊరిలో చేతివృత్తికి పైసా లేకపోగా పొట్ట చేత పట్టుకొని దుబాయ్ దేశాలు వలస వెళ్లి నష్టపోయి బతకలేక ఉన్న కుల వృత్తుల వారిని ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించడం అభినందనీయమని అన్నారు. కుల వృత్తుల వారు ఒక్క లక్ష రూపాయలతో ఆర్థికంగా ఉన్న ఊర్లోనే బతకడానికి సహాయపడుతుందని ఆలోచన చేసిన మంచి మనసున్న మహారాజు ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. ఉమ్మడి మండలాల్లో 2240 దరఖాస్తులు వస్తే అందులో అసలైన పేద చేతి కులవృత్తుల వారిని 1700 మందిని ఎంపిక చేయగా.. ప్రస్తుతం 175 మంది లబ్దిదారులకు చెక్కులు అందజేసినట్టు తెలిపారు. ఇది నిరంతరం ప్రక్రియ అని ఆయన తెలిపారు. కలెక్టర్, ఎంపీడీఓలు, సర్పంచ్‌లు కులవృత్తుల వారి పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. వారిపై పెత్తనం చేయకుండా ఊరిలో దుకాణం ఏర్పాటుకు స్థలం ఉంటే ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆర్‌డీఓ రాజాగౌడ్, డీఎస్‌పీ కిరణ్ కుమార్, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మూడ్ కవిత అంబర్ సింగ్, జడ్పీటీసీలు భాస్కర్‌రెడ్డి, హరిదాస్, నారోజీ గంగారాం, హన్మంత్‌రావు, ఎంపీపీలు ఉమా, శ్రీలక్ష్మి, సుజాత, లావణ్య, సర్పంచ్‌లు సత్తిబాబు, రాజు, కర్లం సాయరెడ్డి, నరేందర్‌రెడ్డి, కోర్వ భాగ్య భూషణం, దాసరి గంగారాం, రవి, సత్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపాల్, మండలాధ్యక్షులు గిరి, అంబర్‌సింగ్, హన్మంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు బాలరాజు, సాయిలు, పీఏసీఎస్ చైర్మన్లు ప్యారం అశోక్, సుధాకర్‌రెడ్డి, కృష్ణరెడ్డి, కో అప్షన్ మెంబర్ ఖరీం, పేరోజ్, మస్తాన్, సీనియర్ నాయకులు మేక వీర్రాజు, ఎంపీటీసీ సాయిలు, సాయగౌండ, తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

లిస్టులో పేరు ఉంది.. చెక్కు ఇవ్వలేదు..

వర్ని మండలంలో జాకోరా గ్రామనికి చెందిన కమ్మరి ఆర్.నగేష్ పేరు లిస్టులో ఉందని, కానీ.. తనకు చెక్కు అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా.. తన పేరులేదని మాట మార్చడం మండల, గ్రామ ప్రజాప్రతినిధులకు సరికాదని ఆవేదన వెళ్లగక్కాడు. ఈ విషయం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి చెక్కు అందేలా చూస్తానని హామీనివ్వడంతో నాగేష్ శాంతించాడు. పొరపాట్లు చేయవద్దని ఆయన ప్రజాప్రతినిధులను హెచ్చరించారు.

జాతీయ జెండాకు అవమానం

- తలకిందులుగా జెండాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-పిట్లం/మద్నూర్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు త్రివర్ణ పథకావిష్కరణలో తలకిందులుగా ఎగురవేసి జాతీయ జెండాకు అవమానం కలిగించారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు పోలీసులు పెద్దఎత్తున చేరుకున్నారు. వారి సమక్షంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని నిర్లక్ష్యంతో తలకిందులుగా ఎగరవేసి జాతీయ జెండాకు అవమానం కలిగించారు. గమనించిన పలువురు తలకిందులుగా ఎగరవేసిన జాతీయ పతాకాన్ని కొద్ది క్షణాల్లోనే సరి చేశారు.


పిట్లం : తలకిందులుగా జెండావిష్కరణ


మద్నూర్ : తలకిందులుగా జెండావిష్కరణ

ఐకేపీ కార్యాలయం వద్ద..

మద్నూర్ : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేశారు.

ఆలస్యంగా జెండావిష్కరణ..

మండలంలోని పెద్దతడగూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్వాతంత్ర్య దినోత్సవం నాడు సైతం సమయపాలన పాటించలేదు. ఉదయం తొమ్మిది గంటలు అవుతున్నప్పటికీ జాతీయ జెండావిష్కరణ కార్యక్రమానికి రాలేదు. గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదురుచూశారు. ఉపసర్పంచ్ హెడ్మాస్టర్‌కు ఫోన్ చేయగా.. 'వస్తున్నా'నని సమాధానమిస్తూ.. 9 గంటల తర్వాత వచ్చారు. హెడ్మాస్టర్ సమయ పాలన పాటించకపోవడంపై ఆ గ్రామ ఉపసర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



యువత.. మార్పులను గ్రహించాలి

నవతెలంగాణ-లింగంపేట్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వీరులను స్మరించుకుంటూ మంగళవారం జాతీయ వాదుల ఆధ్వర్యంలో లింగంపేట్‌లో పురవీధుల గుండా సూమరు 70 బైక్‌లతో 200ల మంది యువకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది నారాయణ మాట్లాడుతూ.. దేశంలో జరుగుతున్న పెను మార్పులను యువత గ్రహించాలని, భారతదేశం వైపు ప్రపంచ దేశాలు మన దేశం చూస్తున్నాయని, రాష్ట్రా దేశ రాజకీయలపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో చేపూరి వంశీ, శ్రీనివాస్, అనిల్‌కుమార్, రమేష్, శశి, ప్రీతం, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రైతు ఉద్యమానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఎస్‌కేఎం నాయకుల డిమాండ్
- స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండావిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రైతు ఉద్యమ కమిటీకి దేశ ప్రధాని రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో నిజామాబాద్ ధర్నా చౌక్ లో 77వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఎస్కేఎం నాయకులు కంజర. భూమయ్య జెండాను ఆవిష్కరించారు.. దేశ్ కు బచావో మోడీ... కార్పొరేట్ శక్తులను హటావో... నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏ. పాపయ్య. అధ్యక్షత కార్యక్రమం నిర్వహించగా రాష్ట్ర కన్వీనర్ వి.ప్రభాకర్, వెంకటేష్, బి.భాస్కర్, దేవారం, వి.భూమయ్య, రమేష్ బాబు, సుధాకర్, ఓమయ్య తదితరులు మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలను కార్పొరేట్ వ్యాపారుల హస్తగతం చేశారని అన్నారు. వ్యవసాయ రంగాన్ని వదలకుండా, అటవీ సంపదల మొత్తం ఆదానీ అంబానీ హస్తగతం చేయడానికి మూడు వ్యవసాయ వ్యతిరేక చట్టాలను రూపకల్పన చేశారని మండిపడ్డారు. దీంతోపాటు విద్యుత్ సవరణ బిల్లును, తీసుకురావడానికి పూనుకున్నారని వీటిని రద్దు చేయాలని ఢిల్లీ కేంద్రంగా 14 నెలల పాటు 500 రైతు సంఘాలకు పైగా ఒక కమిటీగా రూపొంది ఉద్యమించారని అన్నారు. ఈ ఉద్యమంలో 750 మంది రైతు నాయకులు అమరత్వం పొందారని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలకు పైగా భారత రైతాంగ ఉద్యమానికి మద్దతు తెలపడం సువర్ణ అక్షరాలతో గ్రహించబడిన చరిత్ర అని అన్నారు. ఉద్యమకారులను దేశద్రోహులుగా ప్రకటించిన మోడీ, షా మతోన్మాద, ఫాసిష్టులకు ప్రతినిధులు వీరని తెలిపారు. 9 డిసెంబర్ 2021 ఉద్యమాన్ని విరమించమనిదేశ ప్రధాని మోడీ దేశ రైతాంగానికి ప్రజలకు క్షమాపణ చెబుతూ రాతపూర్వకమైన హామీ ఇచ్చారని అన్నారు. రైతు వ్యతిరేక మూడు చట్టాలు రద్దు చేస్తానని, విద్యుత్ సవరణ బిల్లు ఉపసవరించుకుంటానని, పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని రూపొందించడానికి కమిటీ వేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీ అమలు జరపట్లేదని, అబద్దాలకోరు మోడీ అని ఘాటుగా విమర్శించారు. కేంద్ర సమస్యలతో పాటు రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం పోడు భూములు 11 లక్షల 50 వేల ఎకరాలకు పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చి కేవలం 1,50,000 ఎకరాలకే ఇచ్చి చేతులు దులుపుకోవడం సమంజసం కాదని అన్నారు. దీంతోపాటు ధరణిలో రైతు వ్యతిరేక అంశాలను తొలగించాలని రైతులకు ఉపయోగపడే కబ్జాకాలం ఉంచాలని, కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రైతు పసల్ బీమా పథకాన్ని రైతులకు ఉపయోగపడే విధంగా సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సురేష్, బి గంగారెడ్డి, కే.గంగాధర్, గంగాధర్, గంగాధరప్ప, గుమ్మల గంగాధర్, ఏ.రాజేశ్వర్, బొంబాయి గంగారం, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్కేఎం నాయకులు

ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్‌గా ఎంపిక



అవార్డు అందుకుంటున్న మహమ్మద్ అజ్మత్

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ అజ్మత్‌కు స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ ఆపరేటర్ గా అవార్డు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు,జిల్లా పరిషత్ చెర్మెన్ విఠల్ రావు చేతులమీదుగా జిల్లాకేంద్రంలో ప్రధానం చేశారు. ఈసందర్భంగా నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది అభినందించారు.

ఉత్తమ పురస్కారం అందకున్న సిసి నరేష్



పురస్కారం అందుకుంటున్న సీసీ నరేష్

నవతెలంగాణ-భీంగల్

76వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో భీంగల్ ఐకెపి సిసి పురస్తు నరేష్ ఉత్తమ సిసిగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావ్, పిడి చంద్రునాయక్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందకున్నాడు. మహిళ సంఘాల బలోపేతానికి నిరంతరం కృషి చేసిన సిసి నరేష్ ఉత్తమ పురస్కారం అందుకోవడం అబినందనీయమని ఏపియం కుంట శ్రీనివాస్ తెలిపారు. మండల అధికారులు, ప్రజలు ఆయనకు అభినందనలు తెలిపారు.

ప్రశంసా పత్రం అందజేత



ప్రశంసాపత్రం అందుకుంటున్న సాయితేజ

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

స్వతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే పేషంట్ కేర్ విభాగానికి చెందిన సాయి తేజకు రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

సర్పంచ్ లావణ్య ఆత్మహత్యాయత్నానికి స్థానిక ప్రజా ప్రతినిధులే బాధ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కల్లెడ సర్పంచ్ లావణ్య ఆత్మహత్యాయత్నానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులే బాధ్యులని టిడిపి నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి దేగం యాదాగౌడ్ అన్నారు. కల్లెడ సర్పంచ్ లావణ్యని ఆదుకోవాలని అఖిలపక్షాల నాయకులు ప్రజాపంథా ప్రభాకర్, దేవరం, కాంగ్రెస్ నాయకులు పోల వెంకటేష్, టిడిపి నాయకులు దేగామ్ యాదగౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా దేగాం యాద గౌడ్ మాట్లాడుతూ కల్లెడ గ్రామంలో అభివద్ధి చేసిన పనులు మీకు కనబడటంలేదా.. అని అధికారుల పైన మండిపడ్డారు. అభివద్ధి చేయించిన పనులకు బిల్లులు రాక, ప్రశ్నించినందుకు స్థానిక ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సర్పంచ్ లావణ్య భర్తని పగబట్టి జైల్లో వేయించి చాలా ఇబ్బందులకు గురి చేశారని సర్పంచ్ లావణ్య తన బాధని గతంలో చెప్పుకున్నాడని అన్నారు. ఇకనైనా పనికిరాని రాజకీయాలు మానేసి కల్లెడ సర్పంచ్ కు రావలసిన న్యాయపరమైన బిల్లులను విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు అంబిక సత్యనారాయణ, లవంగ రాజు, ఫిరోజ్, రవి పాటిల్, నాగేశ్వర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

2022-23 సంవత్సరానికి గాను పోలీసుగా ప్రజలకు ఉత్తమ సేవలందించినందుకు కమ్మర్ పల్లి ఎస్ఐ రాజశేఖర్ సేవలను గుర్తిస్తూ ప్రశంస పత్రాన్ని అందజేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రోడ్లు భవనాలు గహ నిర్మాణ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు చేతుల మీదుగా ఎస్ఐ రాజశేఖర్ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఎస్సై రాజశేఖర్ ప్రశంసా పత్రాన్ని పొందడం పట్ల మండల ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంపీడీఓకు ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎంపీడీవో

నవతెలంగాణ-మాక్లూర్

ఎంపీడీఓ క్రాంతి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి ప్రశంస్తా పత్రాన్ని స్వతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం అందుకున్నారు. విధినిర్వహణలో తనకు సహకారం అందించిన ఉద్యోగులకు, నాయకులకు కతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

- శ్రీకాంతచారికి నివాళి : టీజీవీపీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థుల బలిదానం వల్ల సిద్ధించిన రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయిందని టిజీవిపి నగర అధ్యక్షుడు అఖిల్ చారి అన్నారు. తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు. అనంతరం తెలంగాణ మలిదశ తొలి అమరుడు శ్రీకాంత్ చారి 36వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. శ్రీకాంత చారి త్యాగాన్ని వధా కనియకుండా రానున్న ఎన్నికల్లో పున: ఉద్యమానికి నాంది పలికి కుటుంబ రాజకీయాలను తరిమికొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సోహెల్, మహేష్, సుజిత్, అదీప్ తదితరులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమానికి పురుడు పోసిన శ్రీకాంత చారి

శ్రీకాంత చారి మలిదశ ఉద్యమానికి పురుడు పోశారని విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవాపురం గోపాలకష్ణాచార్య అన్నారు. మలి దశ తెలంగాణ ఉద్యమ తొలి అమరవీరుడు కాసోజు శ్రీకాంతాచారి జయంతి సందర్భంగా నగరలోని హనుమాన్ జంక్షన్‌లోగల శ్రీకాంతాచారి విగ్రహానికి విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవాపురం గోపాలకష్ణాచార్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు నూనె రాంచందర్ చారి, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, హన్మాండ్లుచారి విశ్వబ్రాహ్మణ ఉద్యోగులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ ప్రవేశాలకు 17 వరకు పొడిగింపు

నవతెలంగాణ-ఏర్గట్ల

నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాలకు ఈ నెల 17 వరకు పొడగించినట్లు పేరెంట్స్ అండ్ టీచర్ కౌన్సిల్ సభ్యుడు తోకల నర్సయ్య తెలిపారు. ఇది రెండు జిల్లాల ప్రజలు గమనించాలని అన్నారు. 6వ తరగతిలో 80 మంది విద్యార్థులకు అవకాశం ఉందని, ఆసక్తి గల వారు ఈ నెల 17 వరకు ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు.